# కొత్తచిగుళ్ళూ - మంచుబిందువులూ

ఆలోచించుకోడానికి కూడా అవకాశం ఇవ్వకుండా మహావేగంతో తనని యిక్కడదాకా తీసుకువచ్చి, ఈనిద్ర గన్నేరు చెట్టునీడలో వదిలేసి, ఇంక నీతో నాకు పనేమిటి అన్నట్లు వెనకగా నీడలో నిలబడిపోయిన తన నెత్తిన యింక దుమ్మెపోస్తూ శరవేగంలో ముందుకు దూసుకు పోతున్న బస్సువేపు కొంచెంసేపు శూన్యంగా చూసి నిట్టూర్చింది సౌదామిని.

అటు చూస్తే పల్లెకుచేర్చే పాము మెలికల కాలిబాట-ఆ బాట వచ్చి పెద్ద తారురోడ్డుకి పాణిగ్రహణంచేసే మొగలో దుమ్ముకొట్టుకుపోయిన యీ నిద్రగన్నేరు చెట్టు-ఈ చెట్టు ఆకుల సందులలోంచి శరీరం అంతా మచ్చలుపడ్డ వాడిలా కనిపించే ఆ అస్తంగత సూర్యుడు!

సరిగ్గా అయిదేళ్ళ క్రితం!

ఇదే బాటదగ్గర యీ చెట్టుకిందే యిలాంటి సంధ్యా సమయంలోనే - ఉత్సాహం ఉరకలు వేస్తూంటే, శరీరం యౌవ్వనపు పొంగులోనూ మనస్సు మధురోహలలోనూ

నిండి దాదాపు తనని తాను మరిచిపోయినస్థితిలో, శేషూ కళ్ళు, పక్కనుండి తనకి పిచ్చెక్కిస్తూంటే, అప్పటిదాకా తనకి శర్వస్వంగా ఉంటూ వచ్చిన పల్లెవేపు వీపు తిప్పి అడుగు కదిపింది తమలోకంలోకి. ఎండమావులులా అందమగా కనిపిస్తూన్న భవిష్యత్తులోకి.

అదే బాట!

ఆ చెట్టే!

మళ్ళా సరిగ్గా ఆ సంధ్యాసమయమే!

తిరిగి నాటికి నేడు-నాటికీ నేటికీ మూడింటిలోనూ మార్పు ఏం లేదు. ఉన్న మార్పంతా తనలోనే. అపుడు "పల్లె" కాదనిపోయి, ఇపుడు ఆ పల్లే కావాలని వస్తూన్న తనలోనే.. తనలోనే ఈ మార్పంతా. ఉషఃకాంతుల తాకిడి కూడా యింకా తగలని లేత గులాబీ మొగ్గ తను అప్పుడు. భయంకరమయిన జీవితానుభవం వేడి తగిలి వెండిపోయి ఆనందపురేకులన్నీ రాలిపోయి ముళ్ళతొడిమ మాత్రంగా మిగిలిపోయిన తన ఇప్పటి స్థితికీ అప్పటి స్థితికీ పోలికా?... ఒత్తయిన తలకట్టూ, మెత్తని చెక్కిళ్ళూ, ధరించిన దుస్తుల్లో బిగువుగా అమిరిన శరీరం. ఇది అప్పటి రూపం. పాయలు పాయలుగా విడిపోయిన జుట్టు, పాలిపోయిన బుగ్గలూ కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకొని కట్టెగా మారిన రూపం ఇప్పటిది.

ఆరోజున తనచుట్టు వికసించిన పుష్పాలే! గండు కోయిలల వగరుగొంతులే! చల్లగా, హాయిగా తగిలే

మలయానిలాలే!.. ఇవాళ తన ఊహల చుట్టు నిలచినవి ఆకులురాలి మోడులుగా మారిన చెట్లు. ఆత్మీయుల అవ హేళనలూ, ప్రాణాల్ని గడ్డకట్టించే మంచుబిందువులూను.

ఎంత మార్పు! అయిదేళ్ళలో ఎంతమార్పువచ్చింది తనలో! పాతరోజులతో యీ రోజుల్ని పోల్చుకుని గట్టిగా తనివితీరా ఏడవాలనిపించింది సౌదామినికి.

మరే!

అంత అదృష్టం కూడానా తనకి! గుండెల్లో బరువు తీరేలాగా యేడ్చి మనస్సును హాయిగా తేలిగ్గా చేసుకో వడం ఎంత అదృష్టవంతులకి... తనకి ఏడుపుకూడా రాదు. అధమం కళ్ళయినా తడికావు. ఎంత బాధవచ్చినా దాన్ని మాటలా గుండెలో రగుల్చుకోవలసిందే! ఈ అయిదేళ్ళ లోనూ శేషువల్ల ఎన్ని అనుభవాలు కలిగి బావురుమని ఏడవాలనిపించలేదు తనకి! కాని ఒక్కమాటు... ఒక్క మాటంటే ఒక్కమాటు ఏడవగలిగిందా తను?

ఊహుఁ! ఏడవలేదు. అసలు తనకది చేతేకాదు! ఏం చేస్తుంది! తను పుట్టి పెరిగిన వాతావరణం అటువంటిది! పదహారేళ్లు వచ్చేదాకా తన అందమయిన అంకసీమలో ముగ్ధలా ఉయ్యాల లూగించిన యీ పల్లె, స్వర్గాన్ని మరి పించే ఇల్లూ, ప్రేమకి ప్రతిరూపమయిన అమ్మా, ఆప్యా యతా అభిమానం ఆకారం దాల్చిన అన్నయ్యా, అన్నిటి కంటే అధికంగా దైవత్వాన్ని పుణికి పుచ్చుకున్న

సూరయ్య మావగారి రాముూ-ఈ వాతావరణంలో పెరిగిన తనకి ఏడుపు అంటే యేమిటో తెలుసుకొనే అవకాశం ఏది? ..

ఆ రోజున ఇవన్ని కాలదన్నుకొని, "శేషు" ఆకర్ష వంతమైన కళ్ళల్లో యేవో కొత్త స్వర్గాలున్నాయని భ్రమించి వెళ్ళి, అయిదేళ్ళయాక మళ్ళీ పూర్వపు ఆనందాన్ని వెతుక్కుంటూ వస్తోంది.

ఇంకా తనకై ఆ ఆనందాలు మిగిలాయా?

సౌదామినికి బాధవల్ల గొంతు అంతా నొప్పిగా వున్నట్లు తోచింది. హృదయంలో మంట, మనస్సులో పెద్ద వెలితి-ఏదో భయం... అలా భయం భయంగానే ఒణుకుతూన్న కాళ్ళతోనే వంకర బాట యెక్కింది... నెమ్మదిగా బరువుగా బాట పల్లెవేపు సాగింది.

సాగి సాగి ఏటికి యివతల ఒడ్డున ఆగిపోయింది ఆ బాట! వర్షాకాలం అయితే దోనెమీద ఏరుదాటి అవతల గట్టు యెక్కితే కాని పల్లె కనిపించదు. శిశిర ఋతువైనా గ్రీష్మంలోలాగా ఏటిలో నీళ్లు లేవు తన కళ్ళల్లోలాగే! అందుకే దోనె అవసరం లేకపోయింది సౌదామినికి!

ఒక్కమాటు ఆగి నాలుగువైపులా చూసింది.

ఎండిన ఏటి మధ్య తను!

ఇటు ప్రకృతి సౌందర్యానికి నీరాజనం ఇస్తూన్న ఎర్రని సూర్యుడూ గూళ్ళకిపోతూన్న పక్షుల మంగళహారతి పాటలూను.

అటు ఏటి అవతల "ఎంత ఘోరపాపాత్ములనయినా క్షమిస్తాను రండి" అని 'చేయెత్తి పిలుస్తూన్నట్లు ఒడ్డుపై నుంచి కొద్దిగా కనిపిస్తూన్న దేవాలయ శిఖరం!

సౌదామినికి శరీరం ఒక్కమాటు ఝల్లుమంది.

ఇదంతా తను పదిపదిహేనేళ్ళు వచ్చేదాకా ఆడి పాడిన చోటు. ఈ ఏటిలో ప్రతి ఇసకరేణువూ ఆ దేవాలయంలోని ప్రతి అంగుళమూ తనకి చిరపరచితమయినవే! ప్రతి సాయంత్రం తనూ రామూ యీ దేవాలయంలోనే పరుగులిడుతూ ఆడుకొనేవారు... రామూ!

తను దొంగ అయి తరుముతుంటే దొరక్కుండా యెన్నిమాట్లు దేవాలయ శిఖరం యెక్కి రామూ తనని ఏడిపించలేదు! ఆటలోలాగే జీవితంలో కూడా రామూ శిఖరంమీదే ఉన్నాడు. తనకి అందేస్థితిలో లేడు. అసలు తను అందుకోడానికి ప్రయత్నించిందా అతణ్ణి!......ప్రయత్నిస్తే శిఖరం యెక్కి అతణ్ని అందుకునేదేమో... లేదా బతిమాలినా చాలు... అతను దిగి వచ్చేవాడు. తను రెండూ చెయ్యలేదు-అలా చెయ్యకపోవడానికి అప్పట్లో తనకి కోపం' పౌరుషం అడ్డు వచ్చాయి.

అందుకే తానీరోజున ఇంత క్రిందగా ఎండిపోయిన ఏటి మధ్య!

అతను అంత ఎత్తుగా దేవాలయ శిఖరంమీద!

అతిప్రయాసమీద అవతలి ఒడు యెక్కిన సౌదామినికి యెదురుగా నిలుచున్న దేవాలయం. దాని నీడలో

విశాలంగా పరుచుకున్న పల్లె కనిపించాయి. అప్రయత్నంగా ఒక్క అడుగు వెనక్కి వేసింది సౌదామిని. భయంతో తట పటాయిస్తున్న సౌదామినికి యెదురుగా దేవాలయ శిఖరం మీద మసక వెలుతురులో ఏదో నీడ కన్పించింది నీడ మని షిగా మనిషి. మోకాళ్ళమీద గడ్డం ఆన్చి ఆలోచిస్తూన్న మౌనిగా, ఆ మౌని రామూ ఆకారంగా మారినట్లు అనిపిం చింది సౌదామినికి.

రక్త ప్రసరణ స్థంభించింది. ఉన్నట్టుండి శరీరంలోని ప్రతి అణువులోనూ మహావేగంతో కొట్టుకుంటూన్న గుండె చప్పుడు వినిపించింది.

రామూ తలెత్తి ఇటు చూస్తే! ... చూసి తనని పలకరిస్తే!

"హమ్మో"!

తను ఏ మొహం పెట్టుకుని సమాధానం ఇస్తుంది? అసలు ఏం ఇస్తుంది?... రామూకే కాదు తను యెవ్వరికీ యివ్వలేదు సమాధానం. "ఆరోజున అలా చెప్పకుండా ఈ స్వర్గాన్ని వదిలి యెక్కడికి వెళ్ళిపోయావు ఈ అయిదేళ్ళూ ఎక్కడ వున్నావు? ఇప్పుడు ఎందుకు తిరిగి వచ్చావు" అని కనక ప్రశ్నిస్తే.

అవును! అమ్మ యిలా అడిగితే, లేదా అన్నయ్యే నిలదీసి ప్రశ్నిస్తే తను యేం సమాధానం చెప్పేట్టు?... ఒక్క క్షణం వెనక్కి వెళ్ళిపోదాం అనిపించింది సౌదా మినికి ... కాని వెళ్ళిపోవడానికి తను యింతదూరం

వచ్చిందే? అన్నింటికీ సిద్ధపడే వచ్చిన తనకి. సమాధానం ఏం చెప్పాలా అనే సంకోచం యెందుకు? వాళ్ళ కాళ్ళ మీదపడి "పొంగులువారే వయస్సులో కుడి ఎడమలు తెలియక పొరబాటు చేశాను. క్షమించండి" అని అడుగుతుంది. దేవతామూర్తులులాంటి అమ్మా అన్నయ్యల సాన్నిధ్యంలో, పవిత్ర దేవాలయంలాంటి ఆ ఇంట్లో పశ్చాత్తాపంతో కుమిలిపోయినా తన పాపం కొంత క్షాళితం అవుతుంది.

బరువుగా, భయంగా తడబడుతూ కాలుతీసి కాలు వేస్తూ వీధి మొగలోకి వచ్చిన సౌదామినికి, అరుగుమీద చుట్ట కాల్చుకుంటూ సూరయ్య కనిపించాడు మావ౯. అనుకున్నంతా అయింది. "ఆగవే భడవా! ఇన్నాళ్ళూ ఎక్కడికెళ్ళావు?" అంటూ ఒక్క ఉరుము ఉరిమితే... గబగబా నడిచింది సౌదామిని. సూరయ్య మావ అసలు పలుకరించే లేదు. తనని పలకరించడానికి అసహ్యం వేసిందేమో!

ఒక్క అంగలో యిల్లు జేరుకొని "అమ్మా!" అని పిలుద్దాం అని తెరిచిన నోరు ఆ మట్టునే వుండిపోయింది. నిత్యమూ కలకల్లాడుతూ కలువల తోరణాలతో నవ్వుతూ వుండే గుమ్మం తాళంవేసి వుంది. ఇవతల గేటుకికూడా తాళం వుంది. అమ్మా అన్నయ్యా ఎక్కడికి వెళ్ళారు? ఎవర్ని అడగడం? పైట చెంగు నోట్లో కుక్కుకుని "ఈ

యింటికి పరాయిదానిలా గేటు ఇవతల వుండిపోవలసి వచ్చిందే!" అంటూ మౌనంగా బాధపడసాగింది సౌదామిని. గేటుమీద తలఆన్చి అలా యెంతసేపు వుండిపోయిందో!

ఇంతలో చేతి లాంతరు పట్టుకొని అటే వెడుతూన్న "వెంకి" ఆగిదగ్గరగావచ్చి పరకాయించి సౌదామినినిచూసి "అయ్యో నా తల్లీ!... ఇప్పుడు వచ్చావా! నీ కోసం ఏడాదిపాటు ఏడిచి ఏడిచి ఆ మహాతల్లి తల్లిపోయాక - సూసి సూసి అన్నయ్యా దేశాలు పట్టుకుపోయాక ఇప్పుడొచ్చి ఏంలాభం నాతల్లీ! ఇదిగో... చెల్లాయివస్తే తాళం చెవులు ఇమ్మని ఎల్లిపోయాడు యెక్కడికో ఆ మారాజు - ఎప్పుడూ అయి యిలా సెంగుని కట్టుకు తిరుగుతున్నా" అంటూ తాళాలు తీయసాగింది వెంకి...

పిడుగుపడ్డట్టు ఆ మాటలు విని ప్రాన్పడి వుండిపోయింది సౌదామిని... గుండె ఆగి మెదడు స్థంభించినట్లు అయింది... అమ్మ... అమ్మ తనకింక లేదూ? కడుపులోంచి యేదో జ్వాల... మంటల్లో నిలబడినట్లు మహా ఆవేదన!

"నిలబడిపోయావేం తల్లీ. లోపలికిరా" అన్న వెంకి కేకకి, వులిక్కిపడి వెంటనే వెర్రి ఆవేశంతో బాణంలా దూసుకుని యింట్లోకి వచ్చింది. ఆమె పిచ్చిగా తలుపులన్నీ బార్లాతీసేస్తూ గదులన్నీ వెతకసాగింది. ఎందుకో!... ఏ గదిలో నేనా అమ్మ వుండకపోతుందా అని ఆశ కాబోలు!

పెరటితలుపు తీసింది... అప్పుడే వస్తూన్న లేత వెన్నెల చెట్ల ఆకులమీదపడి తళుక్కుమని మెరుస్తోంది. అరటిగెల మిగలి మగ్గి వుంది. సగం పళ్ళు నేలమీద రాలి నల్లగా కమిలిపోయి వున్నాయి. దానిమ్మపళ్ళు చెట్టునపండి బద్దలై తనని చూసి యెర్రగా నవ్వుకున్నాయి. అమ్మ పూజ చేసుకుంటుందని రోజూ ముద్దముందార విరగబూస్తోంది శాబోలు. వాడి యెండి రాలిపోయిన మందార పువ్వులు, చెట్టుచుట్టూ గుట్టలు గుట్టలుగాపడి ఉన్నాయి. పెరటి చూరుకి పట్టిన తేనెపట్టునుంచి ఎండుటాకులమీద చుక్క చుక్కలుగా తేనె పడుతూ చప్పుడు చేస్తోంది ఆ చుక్కల కోసం ఆకులమీద నోరు తెరుచుకుని కూచున్న గండుచీమలకి మాత్రం ఆ చప్పుడేం పట్టినట్లు లేదు!

పెరట్లోని ఆ దృశ్యం చూస్తే వృథాగా నేలపాలైన తన జీవితం గుర్తుకువచ్చింది ఆమెకి. వెంటనే పెరటి తలుపు విసురుగా వేసేసి పక్కగదిలోకి వచ్చింది. అది అమ్మ పూజా మందిరం. వ్యాస పీఠంమీద తెరిచిన భగవద్గీత తెరిచినట్టే వుంది. రామపంచాయతనం చుట్టూ సాలీడు అల్లుకొని వుంది. నూనె ఆఖరిబొట్టు వున్నంతవరకూ వెలిగి వెలిగి చివరికి ఆరిపోయినట్టున్నాయి కుందెలలో నల్లగా బూడిదగా మారిన.వత్తులు! అమ్మని నిశ్చలంగా కూర్చొని చెదరని మనస్సుతో పూజచేసుకొనే పవిత్ర ప్రదేశం అది. ప్రశాంతతని ప్రసాదించే ఆచోట ఆమెకి యెంతో ఇబ్బంది గా తోచింది. అవును... తనలాటి చంచలబుద్ధి వున్న

వాళ్ళకి అక్కడ చోటులేదు. గుండె నిబ్బరం మారద్మిటి వున్న అమ్మకీ, వెర్రి ఆవేశంతో యేది తోస్తే అది చేస్తూ ముందుచూపు లేకుండా బోర్లాపడే తనకీ పోలికేవిఁటి? ఆ తల్లికి కూతురే తను!

అన్నయ్య గదిలోకి అసలే కాలుపెట్టలేకపోయింది. సరస్వతీ నిలయంలాగా యెప్పుడూ పుస్తకాలతో పవిత్ర గ్రంథాలతో కన్నులపండువులా వుండే అన్నయ్య గది యిప్పుడు దుమ్ముతో దూగరతో గబ్బిలపు కంపుకొడుతూ వుంది. గదిలో యే వస్తువూ లేదు. అలమారు... షెల్ఫూ... మంచం... అన్నీ శూన్యం... గది మధ్య వో టేబిల్ మీద మాత్రం అన్నయ్య ఫోటో! తనకి చిన్నప్పుడు గోరుముద్దలు తినిపించి యెంతో గారంగా చూసుకున్న అన్నయ్య... అలాంటి అన్నయ్యకి మారుగా తనకివాళ మిగిలింది వాడి ఫోటో మాత్రమే. ఇంక "ఈ ఫోటో చూసుకొని బ్రతుకు" అంటూ వెళ్ళిపోయావా అన్నయ్యా! ఎక్కడికి వెళ్ళావు! ఏమీ చెప్పకుండా యెవఁకీ తెలియని చోటికి యెక్కడికి వెళ్ళావు! అవును లే! సరిగ్గా నేనూ ఇలాగే నీకు చెప్పకుండా వెళ్ళిపోయానుగా? నాకు కావలసిన శిక్షే యిది! అప్పుడు నువ్వు యెంతగా బాధపడ్డావో! ఏం చెయ్యను అన్నయ్యా!

అవును. నేనేం చెయ్యను! మంచిచెడ్డలు ఆలోచించే వయస్సుకాదది! రోజూ నాతోపాటే తిరుగుతూ నన్నేడిపిస్తూ నాచేత మొట్టికాయలు తింటూన్న "రామూ" నాకు

మొగుడేవిటి! వాడికిచ్చి పెళ్ళిచేస్తానంటుందేవిటి అమ్మ. ఓ ఇంగ్లీషు రాదు...సూటు వెయ్యడం చేతకాదు. సిగరెట్టు కాల్చడంకూడా తెలియదు...ఆఖరికి తనని శాసించి అధి కారం చలాయించే మగవాడి దర్జా, ఠీవీ ఇవేం లేవు...

అవునో. అవన్నీ కొత్తగా యీ వూరు దేవాలయం ఆఫీసరుగావచ్చి, ఎదురుగుండా వున్న గదిలో అద్దెకి ఉంటూన్న ఆ అందగాడిలో ఉన్నాయి... బి. కాం. చది వాడట! కవ్వించే కళ్లూ, నల్లగా బిరుసుగా ఉంగరాలు తిరి గిన జుట్టూ, ఆ అందమయిన సూటులో పచ్చగా కదిలే ఆ అబ్బాయికీ "రాము"కీ పోలికా? ఎలాగేనా అతనితో మాట్లాడాలి. ఎలాగయినా అతని పరిచయం సంపాదిం చాలి...ఎలాగ!...ఎలాగ?... జీవితం తియ్యగా ఉండాలనీ బృందావనంలా తీర్చిదిద్దుకోవాలనే ఆకాంక్షలో యిది మంచా చెడా అనే ఆలోచన లేకుండా, ముందుగా "ఏమండీ! మీ చేతిలోవున్న పుస్తకం యేమిటో ఓమాటు యిస్తారా! చదివి మళ్ళీ ఇస్తాను" అని కబురుచేసింది తను యీ వెంకి ద్వారానే! అతను యెంత చిత్రంగా నవ్వి ఆ పుస్తకం పంపించాడు! అట్ట తిప్పగానే తెలిసింది అతని పేరు శేషు అని.

ఆ పుస్తకం యెంత బాగుందని! తనకెప్పుడూ అను భవంలేని కొత్తలోకాల్లోకి తీసుకువెళుతూ, కవ్విస్తూ... ఇలా యెన్ని పుస్తకాలు, ఎన్ని పుస్తకాలు! అన్నింటి లోనూ నాయకుడూ, నాయికా...శేషూ తనూలాగ

ప్రేమించుకోవడం. పెద్దవాళ్ళు వద్దనడం... ఎదిరించి పెళ్ళి చేసుకోనడం, లేదా చెప్పకుండా యిద్దరూ వెళ్ళిపోవడం. అలా వెళ్ళి స్వర్గాలు సృష్టించుకోనడం! తనుకూడా అలా శేషుతో వెళ్ళిపోయి... అమ్మో, అన్నయ్యకీ అమ్మకీ చెప్ప కుండానే!...

అమ్మ పూజలోవుండగా, అన్నయ్య పొలంవెళ్ళగా చూసి, కిటికీలోంచి తను శేషుకి యెన్ని రాయబారాలు కళ్ళతో పంపించిందో. అతనిచ్చిన నవలల్లో పెట్టి ఎన్ని ఉత్తరాలు అందించిందో చివరకి ఆరోజున శేషు తనని ఎలా ఒప్పించాడని! "రా...నాతో వచ్చెయ్యి. హాయిగా ఆదర్శంగా వుందాం. ముందు మీ వాళ్ళకు చెప్పకు. తరు వాత తెలిసి వాళ్ళే సర్దుకుంటారు. జంకకు.. నువ్వు చదివిన నవలల్లో అమ్మాయిలు యేం జేశారో, ఎలా జేశారో జ్ఞాపకం తెచ్చుకో! ఊ... ఒక్కమారు జ్ఞాపకంతెచ్చుకో."

మంత్రగాడి మాటలువిని అతను చెప్పినట్లల్లా చేసి నట్టు ఆ సాయంత్రం అతనితో బయలుదేరి పల్లె వదిలి, కాలి బాట నడిచి, పెద్దరోడ్డు యెక్కి, ఆ నిద్రగన్నేరు చెట్టు నీడలో బస్సుయెక్కి పట్నం వెళ్లిపోయింది తను. అలా వెళుతుండగా అమ్మా, అన్నయ్యా జ్ఞాపకంవచ్చి యెంత ఏడుపు వచ్చిందో తనకి మళ్ళీ రామూ జ్ఞాపకంవచ్చి అంత నవ్వు వచ్చింది రామూలాంటి అమాయక గబ్బిలాయితో కాకుండా శేషూలాంటి నాగరికుడయిన యువకుడితో తనకి వివాహం జరిగించబోతూన్న దేవుడికి ఎన్నిమాట్లు కృత

జ్ఞత లభిస్తుందో! కాని రోజులు గడిచి, శేషు తనని పెళ్లి చేసుకోబోడని తెలిసి, క్రమంగా పెరుగుతున్న అతని విద లింపులూ, కేకలూ విని, అసలు సంగతిని అర్థం చేసుకొనే టప్పటికి, తను ఎంత చలించిపోయింది! ఎంతగా కుమిలి పోయింది!

అలా తను శేషువల్ల నరకం అనుభవించింది ఎన్నాళ్ళని! ఒకరోజా రెండురోజులా! అయిదేళ్లు! ఈ అయిదేళ్ల నుంచీ 'యెప్పటికేనా శేషులో మార్పు రాకుండా వుంటుందా? తనని పెళ్ళిచేసుకోకుండా ఉంటాడా? అంటూ ఆశతో యెదురుచూస్తూంటే చివరికి తన ఆశ అడియాశ చేసి ఓరోజున చెప్పకుండా వెళ్ళిపోయాడు. ముక్కూ మొహం తెలియని ఆ పట్నంలో దిక్కుమాలిన అనాధగా మిగిలి పోయిన ఆరాత్రి. తలుచుకుంటే ఆరాత్రి...అమ్మో! ..గజ గజా వణికిపోయింది. గట్టిగా అరిచేసింది సౌదామిని!

అది విని వెంకి బిత్తరపోయి, ఆమట్టునే కొంచెంసేపు వుండిపోయి. ఆ తర్వాత లాంతరు అక్కడే వుంచేసి "ఇప్పుడే వస్తా" అంటూ వెళ్ళిపోయింది. తడబడుతూన్న కాళ్ళతో కంగారుగా మసిబారిన గాజుపలకల్లోంచి ఎర్రగా నల్లగా మసక మసకగా కనిపిస్తూన్న దీపాన్ని చూస్తూ, తన జీవితాన్ని గుర్తుచేసుకుంటూ, మోకాళ్ళమీద గెడం ఆన్చుకుని కూర్చున్న సౌదామిని, గేటుతీసుకొని యెవరో నిడగా లోపలికి వస్తూ వుండడం చూసింది. ఆ వ్యక్తి దగ్గ రగా వచ్చాక రాముా అని గ్రహించి గ్గునలేచింది. "దీపం

కనిపిస్తోంది, ఎవరబ్బా వచ్చింది" అంటూ రామూ దగ్గరగా వచ్చి పరిశీలనగా చూసి, వెంటనే "నువ్వా! వచ్చావా!" అన్నాడు ఉద్వేగంగా.

సమాధానం ఏం చెప్పకుండా వచ్చే దుఃఖాన్ని పెదిమకీ, పంటికీ మధ్యన బిగించి తలవంచేసింది.

రామూ ఏదో చెప్పబోయికూడా అంతలోనే ఆగిపోయాడు ఆమె స్థితిని చూసి. మౌనంగా ఒకరి బాధ ఇంకొకరు అర్థంచేసుకుంటూ వుండిపోయారు. సౌదామిని కొంచెంసేపటికి కాని తలెత్తి అతనికేసి చూడలేకపోయింది. ఆ మసక చీకట్లో వివర్ణమైన రామూ ముఖం స్పష్టాస్పష్టంగా కనిపించి కంగారుగా "రామూ! నాకోసం బాధ పడుతున్నావా?" అంది.

వెంటనే ముఖాన్ని సాధ్యమయినంత సౌమ్యంగా మార్చుకుంటూ "అబ్బే, లేదు .. లేదు" అన్నాడు తడబడుతూ.

రామూ అన్న ఆ మాటలు విని, నిస్తేజురాలయిపోయింది. నూనె అయిపోయిందో. గాలితాకిడే తగిలిందో కాని దీపం రెపరెపలాడుతూ కొట్టుకోసాగింది.

సౌదామినికి దుఃఖం కట్టలు తెంచుకుంటూ వచ్చింది. రెండు గుప్పిళ్లతోనూ నోరుమూసుకుంటూ "అవును లే! నువ్వు రామూవి... నువ్వెందుకు బాధపడతావు! అయినా యీ నిర్భాగ్యురాలికోసం బాధపడడం కూడా అనవసరం. అయిదేళ్ళ క్రితం వసంతంలో వెళ్ళిపోయిన

దాన్ని తిరిగి యీ హేమంతంలో వచ్చాను. మళ్ళీవసంతం కోసం ఆశిస్తూ - పోగొట్టుకొన్న వసంతం తిరిగి లభిస్తుందా! ప్చ్" ఈ మాట లంటూంటే ఆమె కంఠం వణికింది.

ఆమె మాటలు అర్థంకాక రామూ అలాగే నిలబడి చూస్తూ వుండిపోయాడు.

"నీ కర్థంకాదు రామూ! నీకు అర్థంకాదు. నువ్వు దేవుడివి. అందుకే నిన్ను అందుకోలేకపోయాను" అంటూన్న ఆమె కళ్ళల్లోంచి రెండు మంచుబిందువులు రాలి రామూ కాళ్ళమీదపడ్డాయి

ఆ మంచుబిందువులు తమ మధ్య కొత్తచిగుళ్ళని చిగురింపజేస్తాయని ఆమెకి ఆశలేదు.

అందుకే సౌదామినినిర్జీవంగా నిలబడిఉండిపోయింది.

ఏమీ అర్థంకాక రామూ శూన్యంగా చూస్తూవుండిపోయాడు.

వాళ్ళిద్దరిమధ్యనా అప్పటిదాకావున్న ఆ కాస్త గుడ్డివెలుతురూకూడా చేతిలాంతరు మసిబారి, దీపం కొడిగట్టిన కొద్దీ క్రమక్రమంగా చీకటిగా మారిపోసాగింది.